క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసిన నాయకులు



మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసిన పెదవేగి మండల వైఎస్సార్ సీపీ నేతలు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరిని పెదవేగి మండల వైఎస్సార్ సీపీ నేతలను శనివారం రాట్నాలకుంటలో మర్యాదపూర్వకంగా కలిశారు. పెదవేగి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జీ.స్టాలిన్, నడిపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, ఏజీపీ మద్దాల వాసుదేవరావు, నాయకులు జీ.విజయరాజు, యండ్రపాటి విలియమ్, నక్కా ఏసు, ఎస్సీ సెల్ నాయకులు మద్దా గోపాలరావు ఉన్నారు.

దెందులూరు సీహెచ్‌సీకి బేబీ వార్మర్లు



దెందులూరు సీహెచ్‌సీకి మంజూరైన బేబీ వార్మర్లు

దెందులూరు: దెందులూరు సీహెచ్‌సీకి ఆధునీకరణలో భాగంగా ఆరు బేబీ వార్మర్లు మంజూరయ్యాయని దెందులూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్‌బాబు అన్నారు. రూ.2.75 కోట్లతో ఆధునీకరణలో భాగంగా చిన్నారులకు ఉపయోగపడే బేబీ వార్మర్లు, ఇంక్యుబేటర్లు సీహెచ్‌సీకి వచ్చాయని సూపరింటెండెంట్ సుందర్‌బాబు తెలిపారు.

మానవత సభ్యుల శాంతి ర్యాలీ



నారాయణపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సభ్యులు

ఉంగుటూరు: మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నారాయణపురంలో నిర్వహించారు. శాంతిని ఆకాంక్షిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉషోదయ పాఠశాల వద్ద నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. సంస్థ మండల అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, కార్యదర్శి గంజి రవి, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, మండల కన్వీనర్ అడపా శ్రీను, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, బొమ్మిడి అప్పారావు, సూర్యనారాయణరాజు, వార్డు సభ్యుడు నేదూరి గంగాధర్, సతీష్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



దుద్దేపూడిలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త కె.ఫణికుమార్, ఏవో ఉషారాణి

భీమడోలు: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ అన్నారు. దుద్దేపూడిలో మండల ఏవో ఎస్‌పీవీ ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్తల బృందం కె.ఫణికుమార్, డి.నాగేంద్ర, వీపీఏలు కొల్లి ఆదిత్య, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

భీమడోలు: ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు మాంటిస్సోరి విద్యాసంస్థల కార్యాలయంలో శనివారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత కె.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, పరుగు, కబడ్డీ, షటిల్, టెన్నీకాయిట్, దేశభక్తి గేయాలు, క్విజ్ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందించారు. ప్రిన్సిపాళ్లు అశోక్, పెనుమూడి బాబు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్ల పంపిణీ

ఉంగుటూరు: పంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు గుణ్ణం రామచంద్రరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. రామచంద్రరావు కుమారుడు గుణ్ణం సురేష్ వీటిని పంపిణీ చేశారు. సర్పంచి దిడ్ల అలకానంద శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు.. అప్రమత్తతతో నివారణ

- వర్షాకాలంలో అధిక ఘటనలు నమోదు
- ప్రజలకు అవగాహన లేమి ప్రధాన కారణం
- విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లిప్తత
- ప్రాణాలు కోల్పోతున్న మనుషులు, పాడి పశువులు



కొనికి గ్రామంలో విద్యుదాఘాతంతో మృతిచెందిన యువకుడు (ఫైల్)

పెదపాడు: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నాయి. విద్యుదాఘాతానికి గురై పశువులతోపాటు అనేక పశువులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచుగా వెలుగుచూస్తున్నాయి. వర్షాలు కురిసేటప్పుడు స్తంభాలకు విద్యుత్ ప్రవాహం రావడంతో వాటిని తాకిన ప్రజలతో, పశువులు విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. వర్షాలకు గోడలు నానివాటికి విద్యుత్ ప్రవహించడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై విద్యుత్ శాఖాధికారులకు ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో పాటు చిన్నపాటి సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం వరకే తమ పని అన్నట్లు ఆశాఖ సిబ్బంది మిన్నకుంటున్నారు. చేపల చెరువుల వద్ద పని చేసే కార్మికులు, కాపలాదారులు తరచూ విద్యుదాఘాతానికి గురవుతున్నారు. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా పశువులకు విద్యుదాఘాతానికి గురవుతున్నాయి. లారీల నుంచి సరుకుల అన్‌లోడింగ్ సమయంలో కూలీలకు విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడుతున్నారు. సరైన అవగాహన లేకపోవడంతో అనేక మంది విద్యుదాఘాతానికి గురవుతున్నారు. ఈ ఏడాది మే నెలలో చేపల చెరువు గట్టుపై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో కొనికి గ్రామానికి చెందిన పండు చైతన్యబాబు ఇటీవల మృతి చెందాడు. అంతకుముందు ఏపూరు గ్రామంలో ఓ వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు.

విద్యుత్ వినియోగదారులకు సూచనలు

- వర్షాకాలంలో మోటారు స్విచ్‌లను తడి చేతులతో, చెప్పులు లేకుండా ఆన్ – ఆఫ్ చేయరాదు.
- పొలాల్లో తెగిపడిన తీగలను తాకరాదు. పొలాల చుట్టూ వేసే కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదు. ఆక్వా చెరువుల చుట్టూ విద్యుత్ తీగలను నేల మీదుగా తీసుకువెళ్లరాదు. పంటల రక్షణకు పొలాల వద్ద, చేపల చెరువుల చుట్టూ ఏర్పాటు చేసే కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదు. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌ను రైతుల సొంతంగా వేసుకోరాదు. విద్యుత్ తీగలకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలను కరెంట్ ప్రవాహం ఉండగా నరకరాదు. గడ్డి, ఊక రవాణా వాహనాలు నడిపేటప్పుడు విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లపైన ఆడుకునే పిల్లలు విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలి. హీటర్ వాడేటప్పుడు స్విచ్ ఆఫ్ చేయకుండా నీటిని తాకరాదు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని నేరుగా తాకరాదు. విద్యుత్ తీగలకు దగ్గరలో బట్టలు ఆరవేయకూడదు. పొడవైన ఇనుప పైపులు చువ్వలు, తీగలకు దగ్గరగా తీసుకువెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఐఎస్‌ఐ మార్కు ఉన్న విద్యుత్ ఉపకరణాలు మాత్రమే ఉపయోగించాలి. వాహనాలు లోడింగ్ అన్‌లోడింగ్ సమయంలో కార్మికులు విద్యుత్ తీగలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



వినియోగదారులు విద్యుత్ ఉపకరణాల వినియోగంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ శాఖాధికారులు ప్రజలను ప్రమాదాలపై అప్రమత్తత చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. జాగ్రత్తలు పాటించడం వల్ల ప్రమాదాల నివారణకు అవకాశముంటుంది. ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా 1912కు సమాచారం అందించాలి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతాం.

– వై. రాంబాబు, ఏఈ, పెదపాడు మండల విద్యుత్ శాఖ

రోగులకు సత్వరం వైద్య సేవలందించాలి



కాగుపాడు పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి సుధీష్ణ

ఉంగుటూరు: గ్రామాల్లో మలేరియా, డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, రోగులకు సత్వరం వైద్య సేవలందించాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను డాక్టరు మానస వివరించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, శ్రద్ధగా రోగులకు సేవలందిస్తున్నారని తెలిపారు. హస్పిటల్ మేనేజ్‌మెంటు పుస్తకంలో ఎంపీపీ సంతకం చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగుపాడు సర్పంచి కడియాల సుధీష్ణ, జానకీరామ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్
- పలువురు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు



దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్

దెందులూరు: సచివాలయ ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. నెలలో వరుసగా 20 రోజులు ఆలస్యంగా, యూనిఫాం లేకుండా చాలామంది విధులకు, సమీక్ష సమావేశాలకు హాజరవుతున్నారని, జాబ్ చార్ట్ ఏమిటో కూడా తెలియకపోతే ప్రజలకు ఏవిధమైన సేవలందిస్తారంటూ డీపీఓ శనివారం గ్రామ సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు పారిశుధ్య అమలు, విధుల్లో నిర్లక్ష్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాబ్‌చార్ట్ ప్రకారం నెలలో వరుసగా 20 రోజులకుపైగా ఆలస్యంగా వస్తున్న ఉద్యోగులను, యూనిఫాం వేసుకోని ఉద్యోగులను, జాబ్‌చార్ట్ తెలియని ఉద్యోగులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరికీ వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీలతను ఆదేశించారు. లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఒక్క దెందులూరులోనే రూ. 85 లక్షలు పంచాయతీ పన్ను పెండింగ్ ఉందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాగునీరు సరఫరా, ఉపాధి పనులు, సంక్షేమం, గ్రామ, మండలస్థాయి ఉద్యోగుల అమలులో ప్రాధాన్యత కావాలన్నారు. ఎంపీడీఓ వీ.శ్రీలత మాట్లాడుతూ పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ ఈ నెల 23న ఉపాధి గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించాలన్నారు. ఈఓపీఆర్‌డీ మూర్తి, ఏఓ భీమరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ జహీర్, ఆదర్శరైతు వీరమాచినేని శివాజీ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి



వాకపల్లిలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

గణపవరం: ఎయిడ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి, ఎయిడ్స్ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శనివారం గణపవరం మండలం వాకపల్లిలో గుడ్‌ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విల్సన్ మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధి అంటుకునే వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు. సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులను చిన్న చూపు చూడరాదని, వారిని సమాజంలో వేరుగా కాకుండా అందరితో సమానంగా చూడాలని అప్పుడే వారికి మానసిక ధైర్యం కలుగుతుందని అన్నారు. ఎయిడ్స్ బాధితులు తగిన చికిత్స పొందితే ఆయుప్రమాణం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాప్తి, నియంత్రణ, నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కండోమ్స్ ఉపయోగం, ఎయిడ్స్–2017 చట్టం, ఏటీఆర్ మందులు, ఏపీఎస్ఏసీ యాప్ టోల్ ఫ్రీ నంబరు తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గుడ్‌ల్యాంప్ ప్రాజెక్టు మేనేజర్ వెలగపల్లి టోనీ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరించిన అనంత కోటిరాజు

గణపవరం: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రాజు వేగేశ్న ఫౌండేషన్ ఎండీ వేగేశ్న అనంతకోటిరాజును ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. అమెరికా నుంచి శనివారం ఆయన స్వగ్రామం గణపవరం వచ్చిన అనంతకోటిరాజును ఎమ్మెల్యేతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే ధర్మరాజును అనంత కోటిరాజు దుశ్శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే ధర్మరాజు కోరారు. ఈ సందర్భంగా గణపవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందించిన అనంతకోటిరాజును వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. గణపవరంలో ఇందిరమ్మ కాలనీ నిర్మాణానికి రూ.50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర రెడ్డికి స్థలం కొనుగోలు నిమిత్తం ఇవ్వగా ఈరోజు ఆ కాలనీ ఎంతో అభివృద్ధి చెందిందని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు నడింపల్లి సోమరాజు, కాకర్ల శ్రీను అనంతకోటిరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అనంతకోటిరాజు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన కార్యక్రమాల అమలులో తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వేగేశ్న సుబ్బరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు, కఠారి రంగరాజు, కూసంపూడి సురేంద్రకుమారరాజు పాల్గొన్నారు.

విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి



ఫ్రెషర్స్ వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థిని



గణపవరం జూనియర్ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్

గణపవరం: విద్యార్థి దశలో స్వీయ క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారని గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం కాలేజీలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, నాడు– నేడు కార్యక్రమంలో ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో అన్ని వసతులు కల్పించిందని వీటన్నింటినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వ్యాపకాలను వదిలి చదువుపైనే దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పుప్పాల వాసుబాబు పరామర్శ



రామకుర్తి నాగేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: అనారోగ్యంతో బాధపడుతున్న, రోడ్డు ప్రమాద క్షతగాత్రులను శనివారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. భీమడోలు, వడ్లపట్ల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఆయన పరామర్శించారు. భీమడోలు శివారు సూర్యారావుపేటకు చెందిన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వాసుబాబు ఆయనను పరామర్శించారు. జిల్లా నాయకులు పసుపులేటి సత్యనారాయణ, తుమ్మగుంట రంగా, ఎంపీటీసీ ఆల్తి గోపి, మండల నాయకులు రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి



భీమడోలు గాంధీబొమ్మ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నినదిస్తున్న విద్యార్థులు



దెందులూరులో మానవహారం నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

భీమడోలు: కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్ హత్య ఘటనను నిరసిస్తూ శనివారం భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల బాలబాలికలు భీమడోలులో కదంతొక్కారు. ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, బాలబాలికలు ఈ అమానుష ఘటనను తీవ్రంగా ఖండించారు. భారీ ఫ్లెక్సీతో ప్లకార్డులను చేతపట్టుకుని వీధుల్లో భారీ ర్యాలీ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఆడ పిల్లలపై ఆత్యాచార ఘటనలను అరికట్టాలి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తేవాలని కోరారు. భీమడోలు గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి వైద్యురాలి హత్యను ఖండిస్తూ నిరసనను తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పై చలపతిరావు, సోషల్ టీచర్ రమణ, ఇతర టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యకు నిరసనగా ర్యాలీ

దెందులూరు : కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌ను విధుల్లో ఉండగా అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో దోషులను పట్టుకుని ఉరిశిక్ష వేయాలని దెందులూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, దెందులూరు నర్సింగ్ కళాశాల విద్యార్థినులు డిమాండ్ చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్‌బాబు ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్లు షాలిని, ప్రియదర్శిని, ప్రియాంక, ప్రసాద్ నాయక్, పవన్, అరవింద, ఆసుపత్రి సిబ్బంది, దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, 70 మంది నర్సింగ్ విద్యార్థులు దెందులూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనలో దోషులందరినీ అరెస్టు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వైద్యులు అన్నారు.

గురుకుల పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వట్లూరు గురుకుల పాఠశాలలో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కావూరి

పెదపాడు: పేదరికాన్ని జయించడానికి చదువు ఒక్కటే ఏకైక మార్గమని మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు తెలిపారు. వట్లూరు గురుకుల పాఠశాలలో ఆయన అందించిన రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కావూరు సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులకు వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ నాయకులు కట్నేని కృష్ణ ప్రసాద్, విక్రమం కిశోర్, ప్రిన్సిపాల్ దాసరి మేరి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ షెడ్యూల్ సిద్ధం చేయాలి



గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు స్పోర్ట్స్ షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ జి.రాజగోపాల్, మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ అన్నారు. శనివారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం పాఠశాల హెచ్‌ఎం, చైర్మన్ డాక్టర్ ఎం.మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ మండలస్థాయి గేమ్స్ సెప్టెంబర్ మొదటి వారంలో ఎఫ్1 అసైన్‌మెంట్ ఎగ్జామ్స్ పూర్తయిన తరువాత రెండో వారంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు, జిల్లాస్థాయి ఆటల పోటీలు మూడో వారంలో నిర్వహించేందుకు ప్రణాళిక నిమిత్తం అన్ని పాఠశాలలకు ఫిజికల్ ఎడ్యూకేషన్ యాక్టివిటీస్‌కు తెలియజేయాలన్నారు.

రామారావుగూడెంలో మేకలు, గొర్రెల చోరీ

దెందులూరు: రామారావుగూడెంలో పది మేకలు, గొర్రెలు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయని బాధిత రైతు కొత్తపల్లి వెంకటేశు కన్నీటిపర్యంతమయ్యాడు. పది మేకలు, గొర్రెలు కలిపి వాటి విలువ రూ. 10లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. శనివారం సాయంత్రం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను పట్టుకుని తన మేకలు, గొర్రెలు ఇప్పించి తన కుటుంబానికి జీవనాధారం కల్పించాలని వెంకటేశు కోరారు.

19 నుంచి గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

దెందులూరు: దెందులూరు మండలంలో గ్రేడ్-1,2,3,4,5 కార్యదర్శులందరికీ నెల 19 నుంచి 21 వరకు దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు దెందులూరు ఎంపీడీఓ వీ.శ్రీలత తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శానిటేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్, జీటీడీపీ, వీధిలైట్ల, కరెంటు బిల్లులపై శిక్షణనిస్తామని, కార్యదర్శులందరూ విధిగా హాజరు కావాలని కోరారు.

నేడు విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 26న శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ఆదివారం పాఠశాల, కళాశాల విద్యార్థులకు వేర్వేరుగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఏలూరు శాఖ ప్రతినిధి రాధా వల్లభ దాస్ తెలిపారు. స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఫోన్ నంబర్లు 89193 87849, 63049 76895, 91773 98223లో సంప్రదించాలని కోరారు.

వర్గీకరణ తీర్పుపై సుప్రీం కోర్టు పునరాలోచించాలి



సూరప్పగూడెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న యువకులు

భీమడోలు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునరాలోచించుకోవాలని కోరుతూ మాల పోరాట యోధుల సంఘం ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన చలో ఏలూరు కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. సూరప్పగూడెంకు చెందిన మాల యువకులు, పెద్దలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారంతా తలకు బ్యాడ్జీలను కట్టుకుని జై భీమ్ నినాదాలతో మోటార్ సైకిళ్లపై ఏలూరు తరలివెళ్లారు. వర్గీకరణ పేరుతో అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదిగలను విడదీసి దళితులకు రిజర్వేషన్లు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న పన్నాగమంటూ వారంతా నినదించారు. తీర్పును న్యాయమూర్తులు పునఃసమీక్షించి రిజర్వేషన్ల వర్గీకరణ చేయవద్దంటూ ముక్తకంఠంతో వేడుకున్నారు.